


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 12 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 06


# నల్లగొండ జిల్లాలో 78.09శాతం పోలింగ్

### నల్లగొండ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్

### చండూరులో రికార్డు స్థాయి 91.52.. నందికొండలో తక్కువ పోలింగ్




**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో ఆరు మున్సిపాలిటీల్లోని మొత్తం 161 వార్డులకు 473 పోలింగ్ కేంద్రాలలోఎన్నికలు ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారుజ జిల్లాలో మొత్తం 3,07,992 మంది ఓటర్లు ఉండగా,2,40,514 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో నల్లగొండ జిల్లాలోమొత్తం పోలింగ్ శాతం 78.09శాతంగా నమోదైంది. మున్సిపాలిటీ వారీగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో 48వార్డులు,199పోలింగ్ కేంద్రాలు,పురుష 68,874,మహిళా 73,507.

మొత్తం ఓటర్లు: 1,42,437లకు 1,10,194పోలై 77.35 పోలింగ్ శాతం నమోదైంది. చండూరు మున్సిపాలిటీలో10 వార్డులు 20పోలింగ్ కేంద్రాలు,పురుష 5,652,మహిళా 5,717మొత్తం ఓటర్లు: 11,370లకు 10,649పోలై 91.90 పోలింగ్ శాతం అత్యధికంగా నమోదైంది.

చిట్యాల మున్సిపాలిటీలో12వార్డులు 24పోలింగ్ కేంద్రాలు,పురుష 5,929,మహిళా 6,188మొత్తం ఓటర్లు: 12,118లకు 10,406పోలై 85.78 పోలింగ్ శాతం నమోదైంది.హాలియా మున్సిపాలిటీ(1 వార్డు ఏకగ్రీవం)11 వార్డులు22పోలింగ్ కేంద్రాలు,పురుష 5,746,మహిళా 5,949మొత్తం ఓటర్లు: 11,696లకు 10,033పోలై 85.78 పోలింగ్ శాతం నమోదైంది.దేవరకొండ మున్సిపాలిటీలో20వార్డులు 40పోలింగ్ కేంద్రాలు,పురుష 11,629, మహిళా 12,200మొత్తం ఓటర్లు: 23,830లకు 19,127 పోలై 80.26 పోలింగ్ శాతం నమోదైంది.మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48వార్డులు 144పోలింగ్ కేంద్రాలు, పురుష 45,128,మహిళా 47,878మొత్తం ఓటర్లు: 93,020 లకు 72,036 పోలై 77.44 పోలింగ్ శాతం నమోదైంది. నందికొండ మున్సిపాలిటీలో 12 వార్డులు 24పోలింగ్ కేంద్రాలు,పురుష 6,441,మహిళా 7,079 మొత్తం ఓటర్లు: 13,521లకు 8,069పోలై 59.68 (అత్యల్పం)గా నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రారంభంలో కొంత మందగమనంగా సాగిన పోలింగ్, మధ్యాహ్నం తరువాత వేగం పుంజుకుంది.మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం గమనార్హం. పట్టణ ప్రాంతాల్లోని పలు డివిజన్లలో ఓటర్ల ఉత్సాహం స్పష్టంగా కనిపించింది.పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన సిబ్బంది,మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు,భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీస్ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ప్రత్యేక నిఘా బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహించాయి.



**పోలింగ్ ప్రశాంతం : జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్**

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు, జిల్లాలోని 6 మున్సిపాలిటీలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఓటర్లకు చేసిన ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పరిశీలించారు.జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, మిర్యాలగూడ,దేవరకొండ,నందికొండ,హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు.మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, స్థానిక తహసీల్దార్ పరశురాం ఉన్నారు.

---

## నే'తల' తలరాతలు మార్చే...

# మున్సి 'పోల్'

### ఈ ఫలితాలతోనే వారి ఫ్యూచర్...!

### అధికార పార్టీ పాచిక పారేనా...?

### ఆ ఇద్దరు నాయకుల కృషి ఫలించేనా..?!

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికను అటు అధికార పార్టీ, ఇటు ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రతిష్టంగా తీసుకున్నారు. గెలుపే లక్ష్యంగా వారు సర్వశక్తులు వడ్డారు. ఈ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి వారి తలరాతలు మారనున్నాయి. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణానంతరం గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగుగా నేడు మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. నియోజక వర్గ ఇంచార్జిగా కొనసాగిన ఆయన లేకపోవడంతో తన తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూర్యాపేట నియోజక వర్గంలో అన్ని తానై ముందుకు సాగుతున్నారు. తన తండ్రి చేసిన పార్టీ ఇంచార్జి పదవి తనకే ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని ముందునుండి కోరుతున్నారు. అయినా అధిష్టానం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు పూర్తి అయిన తరువాతే ఓ నిర్ణయం తీసుకోవాలని పార్టీ పెద్దలు సాగదీస్తూ వస్తున్నారు. ఈ ఎన్నికల్లో పదవిని ఆశిస్తున్న వారి ప్రతిభను గుర్తించి ఇవ్వాలని యోచిస్తున్నట్లు పార్టీలో చర్చ సాగుతుంది. ఇప్పటికే జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పై చెయ్యి సాధించినా ఆ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగకపోవడం ఏ పార్టీ బలం ఎంత అన్నది అంచనా వేయడం సాధ్యంకాని పని. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను బట్టే ఫలితాలు వస్తాయన్నది అందరికి తెలిసిందే. మొదటిసారిగా పార్టీ గుర్తుపై మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఈ ఫలితాలను బట్టి పదవిని కట్టబెట్టే అవకాశం ఉంది. ఫలితాలు అనుకూలంగా రాకుంటే పదవీ చేజారే అవకాశం లేకపోలేదు. ఇతనితో పాటు ఆ పదవిని ఆశిస్తున్న మరోనేత తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిది కూడా ఇదే పరిస్థితి. మున్సిపల్ ఎన్నికలు కొలమానంగా తీసుకొని పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ పదవిని ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన అనుచరులు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఇరువురు నేతలు టిక్కెట్ల కేటాయింపుల్లో కూడా ఉమ్మడి నిర్ణయం తీసుకొని తమ అనుచరులను ఎన్నికలబరిలో నిలపడంతోపాటు ఏండ్ల తరబడి నుండి వీరి మధ్యన ఉన్న విభేదాలను పక్కకు పెట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రెండు పర్యాయాలు చెయ్యి జారీన మున్సిపల్ చైర్మన్ పీఠం చేజిక్కించుకునేందుకు చెమటోడ్చారు. ఆ ఇద్దరు నేతలు వేసిన రాజకీయ పాచికలు పారితే ఈనెల 13వ తేదీన వెల్లడయ్యే ఫలితాలతో వీరి తలరాతలు మారే అవకాశం ఉంది.

**ప్రతిపక్ష పార్టీకి పట్టునిలిచేనా..?!!**

**ఓటరన్నా...! నీ తీర్పుతోనే మార్పు...**



గ్రామీణ ప్రాంతాలకన్నా పట్టణ ప్రాంతంలో మంచి పట్టున్న ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఆ పార్టీ పెద్దదిక్కైన మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి తన రాజకీయ చతురతతో ముందుకు సాగారు. మున్సిపల్ ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల టిక్కెట్ కేటాయింపుల నుండి మొదలు ఎన్నికల ప్రచారంతోపాటు పోలింగ్ ముగిసే వరకు పేటను వీడకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగారు. బిఆర్ఎస్ పార్టీకి మూల స్థంబాల్లో కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులతో పాటు జగదీష్ రెడ్డి మరో మూల స్థంబంగా కొనసాగుతున్నారు. స్థానికంగా తన పట్టును కోల్పోతే ఆయన ఉనికికే ప్రమాదం. దీంతో ఎలాగైనా సూర్యాపేట మున్సిపాలిటిపై ముచ్చటగా మూడో సారి బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పట్టుతో ఉన్నారు. ఏ పార్టీ నాయకుడి తలరాతనైనా మార్చేది ఓటరే కావడంతో ఈనెల 13వ తేదీన వెల్లడయ్యే తీర్పుతోనే వారి మార్పు జరగనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



## పోలింగ్ సరళిని పర్యవేక్షించిన జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/చివ్వెంల :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం జిల్లా ఎస్‌పి కె నరసింహ మండల పరిధిలోని ఖాసింపేట గ్రామంలో గల పోలింగ్ సెంటర్‌ను సందర్శించి పోలింగ్ సరళి, ఎన్నికల భద్రతను పరిశీలించారు. మున్సిపాలిటీలో ఓటరుగా ఉన్న ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ సిబ్బంది ఉన్నారు.

## వైద్యశాఖ సేవలు ప్రశంసనీయం



**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపాలిటీలో నిర్వహించిన ఎన్నికల సందర్భంగా 35 వార్డుల పరిధిలోని 91 పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించిన వైద్య సిబ్బంది అంత్యంత సమర్థవంతంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించడంతో ఓటర్లు, నాయకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పోలింగ్ సమయంలో బిపి, షుగర్, అలసట వంటి సమస్యలతో బాధపడిన ఓటర్లకు వెంటనే వైద్య సహాయం అందించి, అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను, ప్రాథమిక చికిత్సలు చేయడం అభినందనీయమని అన్నారు. అంకిత భావంతో పనిచేసిన వైద్యులు ప్రియాంక, గోలి నరేష్, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బందిని అభినందించారు.

## పార్టీని బలోపేతం చేయాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** కామ్రేడ్ ధనియాకుల గురువయ్య స్ఫూర్తితో సిపిఎం పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకుడు రణపంగు కృష్ణ, సిపిఎం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో నిర్వహించిన కామ్రేడ్ ధనియాకుల గురువయ్య 27వ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 1999 సంవత్సరం కంటే ముందు సూర్యాపేట, తుంగతుర్తి ఉమ్మడి డివిజన్ల సిపిఎం కార్యదర్శిగా ప్రజానాయకుడిగా పనిచేస్తూ నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి జరిపిదాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అయితబోయిన సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు ధనియాకుల వెంకటేశ్వర్లు, ధనియాకుల శ్రీనివాస్, మీసాల బుచ్చయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** గ్రామంలో దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రామన్నగూడెం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామన్నగూడెంతోపాటు కొత్తగూడెం, చాకలిగూడెం గ్రామాల్లో బుధవారం దోమల నివారణ కోసం ఫాగింగ్ మిషన్ ద్వారా మిలాథిన్ మందును వీధుల్లో స్ప్రే చేశారు. ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, నాయకులు పొట్టిపాక సైదులు, రేఖల సైదులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు, సైబర్ నేరాలపై అవగాహన




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సైబర్ మోసాల పట్ల వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌బిఐ బ్యాంకు గడ్డిపల్లి మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని గడ్డిపల్లిలో ఎస్‌బిఐ బ్యాంకు ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాగాళ్లు సెల్ ఫోన్‌లో వస్తున్న బ్లూ లింక్‌లపై క్లిక్ చేయకూడదని, ఎవరైన మేము బ్యాంకు నుండి మాట్లాడుతున్నాము ఓటిపి చెప్పండి, ఖాతా నెంబర్ చెప్పండి, అధార్‌కార్డు చెప్పండి అని ఫోన్ చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని అన్నారు. మీ అకౌంట్ బ్యాలెన్స్ కోల్పోతారని,ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సిఎఫ్‌ఎల్ కౌన్సిలర్ పల్లి శ్రవణ్‌కుమార్, గ్రామసర్పంచ్ మాచెట్టి నాగలక్ష్మి, శ్రీహరి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆర్.సైదా, సిఈవో సైదయ్య, రమేష్, మహేష్, వెంకటరమణ, రాజలింగం, ఉపేందర్ పాల్గొన్నారు.

## చికెన్ షాపుల వద్ద బారులు తీరిన ఓటర్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఓటర్లకు మంగళవారం రాత్రి అందించిన టోకెన్లను చేతబూని బుధవారం ఉదయం నుంచి మిర్యాలగూడ పట్టణంలోని పలు చికెన్ షాపుల దుకాణాల ముందు గుంపులుగా చేరుకోని క్యూలో నిలబడ్డారు. ఆయా పార్టీల అభ్యర్థులు అందించే తాయిలాలకే ఓటర్లు ప్రాధాన్యతనిచ్చి చికెన్ దుకాణాల ముందు బారులు తీరారు. దీంతో చికెన్ సెంటర్ యజమాని తలుపులు మూసి కిటికీలో నుంచి చికెన్ చిట్టీలకు చికెన్ అందించారు. చిట్టీలు మాత్రం ఇంటికి వచ్చాయి కాని ఓటర్లు చికెన్ కోసం నానా తంటాలు పడ్డారు.


## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** కేంద్ర ప్రభుత్వం యూరప్, అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో మోడీ, ట్రంపుల దిష్టిబొమ్మలను అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల అమెరికా బెదిరింపులతో అనేక ఒప్పందాలను ఎలాంటి షరతులు లేకుండానే మన ప్రధాని మోడీతో చర్చలు జరిపిందన్నారు. వాటిని అన్నింటిని ఎలాంటి షరతులు లేకుండా మనదేశం అనుమతించిందని విమర్శించారు. ఈ స్వేచ్ఛ ఒప్పందాల మూలంగా వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోనికి పోతుందని మన పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతు మరింతగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరప్, అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకొని భారత వ్యవసాయ రంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, పోలెబోయిన పేద లింగయ్య, పిడమర్తి భరత్, పోలెబోయిన సురేష్, ఏర్పుల మల్లేష్ పాల్గొన్నారు.

## ఓటు వేసిన ప్రముఖులు











**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. దీనిలో భాగంగా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ పట్టణంలోని 41వ వార్డు బూత్ నెం.123లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి 15వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ బూత్‌నెం.46లో ఓటు వేశారు. మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు కుటుంబసభ్యులతో 21వ వార్డు బాపూజీనగర్ బూత్ నెం.63వ సతీమణి జయ, తనయుడు నల్లమోతు సిద్ధార్థ, కోడలు రాణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి 13వ వార్డులో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు.




## నేరుగా విత్తే వరిలో చీడ పీడల యాజమాన్యంపై అవగాహన

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వరి సాగులో ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు నేరుగా విత్తే వరి పద్ధతి ఉత్తమ మార్గమని కెవికె శాస్త్రవేత్త డి.నరేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసిఎఆర్‌భారతీయ వరి పరిశోధన సంస్థం (ఐఐఆర్‌ఆర్) రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సిఎస్‌ఆర్ నిధుల సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు డైరెక్ట్ సీడింగ్ విధానాల్లో అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించారు. వరిలో డ్రం సీడర్, వెదజల్లే పద్ధతుల ద్వారా విత్తనాల నీటి పొదుపు వంటి ప్రయోజనాలను వివరించారు. సాగులో నేల సన్నద్ధం, సరైన విత్తన శుద్ధి, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల సమగ్ర నియంత్రణ, కలుపు నియంత్రణలో ముందస్తు జాగ్రత్తల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు సిహెచ్ నరేష్, ఎ.కిరణ్, డి.ఆదర్శ్, పి.అక్షిత్‌సాయి, కె. అజయ్, రైతులు పాల్గొన్నారు.

## మోదీ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దేశవ్యాప్త సమ్మెలో రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు పోటు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నేడు జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం డివిజన్ అధ్యక్షులు పారెల్లి నాగయ్య, ఇప్పు జిల్లా నాయకుడు కామళ్ల శ్రీను, గండు నగేష్, చెనగాని పెద్ద సాంబయ్య, చెనగాని పర్వతాలు పాల్గొన్నారు.

## అమరవీరుల స్మారక సభను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** ఈనెల 14న మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని నర్సింహులగూడెం, కలకోవ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సిపిఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జిరామ్‌జీ చట్టాన్ని తీసుకరావడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ మహాసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని, ఈ మహాసభకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ సైదా, విజయలక్ష్మి, వీరబోయిన వెంకన్న, వి.బ్రహ్మం, కొండారెడ్డి, ఎం.వెంకటాద్రి, గురవయ్య పాల్గొన్నారు.

## నివాళులర్పించిన తహశీల్దార్



**ప్రజాపక్షం/మోతె :** మండల తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కాంపాటి సాయిలు మంగళవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందడంతో తహశీల్దార్ యం వెంకన్న మృతుని గ్రామం సిరిపురం వెళ్ళి కుటుంబాన్ని సందర్శించి మృతినికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# కారు గుర్తుకు ఓటేసిన ఓటర్లకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసిన ఓటర్లకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ భవనంపై గులాబీ జెండా ఎగురవేస్తామని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశానని అన్నారు. పుర పీఠాన్ని దక్కించుకోని మిర్యాలగూడ మున్సిపాలిటీలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరిస్తామని అన్నారు. మాపై ఉన్న ప్రగాఢ విశ్వాసంతో, సంపూర్ణ భరోసాతో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటు నమోదు చేసిన ఓటర్లందరికి ధన్యవాదాలు తెలిపారు.

# ముగిసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో కొలువైన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తుర్కపల్లి వార్డు సభ్యురాలు తరుణి సుమని శ్రీహరి, బిజెవైఎం నాయకుడు గోగీకర్ శ్రీను కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ గుండెబోయిన సాయి యాదవ్, సర్పంచ్ బానోతు బుల్లి వీరన్న నాయక్, మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, ఉప సర్పంచ్ హేమలత సాయి మల్లేష్, పూజారి శిగమూగే మల్లయ్య పాల్గొన్నారు.

# వంటిల్లే సైన్స్.. శాస్త్రవేత్తలుగా మహిళలకు చోటేది?

**ప్రజాపక్షం/నకిరేకల్** : శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ, బాలికల శాస్త్ర దినోత్సవం సందర్భంగా బుధవారం నకిరేకల్ మైనారిటీ గురుకుల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక (జెవివి) తెలంగాణ సమతా సబ్ కమిటీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు.ఈసందర్భంగా సిసిఎంబి విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ వి.రాధ సమాజంపై మహిళల శాస్త్రీయ సేవల ప్రభావం పై ప్రసంగిస్తూ మహిళల భాగస్వామ్యం పెరగాలని పిలుపునిచ్చారు.గాంధీ మెడికల్ కాలేజ్ ప్రొఫసర్ డాక్టర్ ఎం.రమా దేవి యౌవన బాలికల్లో మాసిక శుచిత్వం,జంక్ ఫుడ్ ప్రభావంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. యునెస్కో, ఐరాస గణాంకాల ప్రకారం స్టెమ్ (శాస్త్ర, సాంకేతిక, ఇంజినీరింగ్, గణిత) రంగాల్లో లింగ అసమానత్వం కొనసాగుతోంది. జిల్లా కన్వీనర్ యానాల కోకిల పర్యవేక్షణలో జరిగినఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్,జిల్లా సభ్యుడు నగేష్,మండల బాధ్యులు సంధ్య, ఉపాధ్యాయులు అంజలి, అరుణ కుమారి పాల్గొన్నారు.



# ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పురపాలక సంఘం 2026 బుధవారం జరిగిన పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా విజయవంతంగా ముగిశాయి. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పురపాలక పరిధిలోని 13 వార్డులకు 26 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించారు. ఉ.7 గంటలకే 8వ వార్డులో ఏర్పాటు చేసిన ఏకో ఫ్రెండ్లీ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. పురుషులు 7799 మంది, స్త్రీలు 8028 మంది మొత్తం 15827 ఓటర్లు ఉండగా 7098 మంది పురుష,7296 స్త్రీలు మొత్తం 14394 ఓటర్లు ఓటింగ్లో పాల్గొన్నట్లు సహా ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. గరిష్టంగా 91 గణనీయమైన ఓటింగ్ శాతం నమోదయింది.



90.88 శాతం మహిళలు ఓట్లు వేయగా 91 శాతం మంది పురుషులు పోటాపోటీగా ఓట్లు వేసి ఎన్నికల అధికారుల పనితీరుకు అద్దం పట్టారు. మొదటి వార్డు 94.79 శాతంతో మొదటి స్థానంలో రెండవ వార్డు 94.63 శాతంతో రెండవ స్థానంలో 5వ వార్డు 92.50 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. ఓటింగ్ శాతాన్ని బట్టి ఓటర్లలో చైతన్యం చాలా పెరిగిందని అధికారులు ఓటింగ్ అవగాహనలో విజయం సాధించారని తెలుస్తుంది. 13 వార్డులకు 26 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ శాతం గణనీయంగా పెరగడంతో అధికారులు, ఎమ్మెల్యే, కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఆదేశం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ కాల్నె సరితభాస్కర్ పాలకవర్గ సభ్యులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని అందించాలని భోజన ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలు, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు పెట్టే అన్నం, కూరలు మరియు ఇతర పదార్థాల నాణ్యతను పాలకవర్గం పరిశీలించింది. భోజన పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు ముదిగొండ నరేష్, బత్తిని కాటంరాజు, మేడ బోయిన స్వామి, నమిలే చంద్రయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓడిపోతామని తెలిసే దొంగ ఓట్లకు సిద్ధపడ కాంగ్రెస్

**ప్రజాపక్షం/ హాలియా:** రెండేళ్లలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆరోపించారు. బుధవారం జరిగిన పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్ల పాల్పడటం తీరునుబట్టే కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. బుధవారం సాయంత్రం ఎన్నికలు ముగియకముందే ఆయన విలేకరులతో మాట్లాడారు.హాలియాలోనే ఏడు,నాలుగు వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని తెలిసి దొంగ ఓట్లు వేయించుకున్నారని చెప్పారు.దొంగ ఓట్లు వేసిన వారిని తమ పార్టీ నాయ



కులు పట్టుకొని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఓటమి భయం లేకపోతే దొంగ ఓట్లు వేయించుకోవాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

# బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన ఆలయ చైర్మన్



**ప్రజాపక్షం/బీబీనగర్** : శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ సందిగారి బసవయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవాలకు హాజరైన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి దేవాదాయ శాఖ సూపరింటెంట్ భాస్కర్, తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సిఐ ప్రభాకర్ రెడ్డిలకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో గణపతి పూజ పుణ్యా వచనంతో ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన గావించారు. అదేవిధంగా స్వామివారి కల్యాణోత్సవం నేటి సాయంత్రం 10 గంటలకు భక్తుల కరతాల ధనుల మధ్య వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించినట్లు ఆలయ చైర్మన్ సంధిగారి బసవయ్య తెలిపారు. ఈ ఉత్సవాలలో సింగల్ విండో మాజీ చైర్మన్ వాకిటి సంజీవరెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఆలేటి బలరాం, ఆల్వా గోపాల్ రెడ్డి, నడికుడి వెంకటేష్, గోర్కంటి సుజాత, మాజీ చైర్మన్లు ఎర్రబోధ్ శ్రీనివాస్, ఆల్వా వీరారెడ్డి, బొమ్మగాని బసవయ్య పాల్గొన్నారు.



# మల్లయ్య సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ అమరజీవి ఉయ్యాల మల్లయ్య(31) వర్ధంతిని స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ శాఖ కార్యదర్శి మన్నె భీమిరెడ్డి మాట్లాడుతూ మల్లయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పేదల పక్షాన నిలబడి సామాజిక న్యాయం కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు ఎన్నో సేవలందించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేశారని, ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య సతీమణి మాజీ సర్పంచ్ వసంత, వార్డు సభ్యులు కార్తీక్, శ్రీధర్, రాములమ్మ, సీపీఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నూతన వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : గ్రామ పంచాయతీ సిబ్బంది సంక్షేమం మరియు క్రమశిక్షణే ధ్యేయంగా దాతర్ పల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి కాల్నే సరిత భాస్కర్ అభినందనీయమైన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం సర్పంచ్ ప్రత్యేక చొరవతో గ్రామ పంచాయతీ సిబ్బంది అందరికీ నూతన వస్త్రాలు (యూనిఫాం) మరియు షూస్ పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఈ 'డ్రెస్ కోడ్'ను అమల్లోకి తెచ్చినట్లు ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గ్రామ పంచాయతీ సిబ్బంది మేడబోయిన భాస్కర్, నల్లమాస సుధాకర్, బత్తిని నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి



**ప్రజాపక్షం/మునుగోడు** :కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను అన్నారు.బుధవారం మండల కేంద్రంలో వివిధ కార్మిక సంఘాల కార్మికులతో కలిసి అంబేద్కర్ సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసిలో 100 విదేశీ పెట్టుబడును ఉసవరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పందుల చిన్న నరసింహ, కార్యదర్శి.ఇదా రాములు,బొల్లు సైదులు,మాలాద్రి,బజారు హమాలి కార్మిక సంఘ నాయకులు చిరంజీవి,వెంకన్న పాల్గొన్నారు.

# సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/వలిగొండ** : భువనగిరి పరిధిలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులు కోకో పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుపొందారు. వీరిలో నలుగురు విద్యార్థులు ఏ.లోకేష్ కుమార్ డి.ప్రశాంత్ కుమార్, ఎం.నిఖిల్, పి.యశ్వంత్ చారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిఈటి జి.ఐలయ్య బుధవారం తెలిపారు. వీరిని ఎంపీడీవో జి.జలంధర్ రెడ్డి, మండల విద్యాధికారి ఎస్.భాస్కర్, ఎస్సై యుగంధర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాయి సున్నీసా బేగం, గ్రామ సర్పంచ్ రాములు ఉపాధ్యాయుల బృందం అభినందించారు.



## అంతర్జాతీయ సభలో టంగుటూరి సైదులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ,తెలుగు పద సంపద సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెలుగు భాషా సభలో మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన నాగార్జున ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టంగుటూరి సైదులు తెలుగు పద్య వైభవం జీవన పరమార్థం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. అనంతరం ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, తెలుగు పద సంపద అధ్యక్షులు మూర్తి రేమిళ్ల, తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ సైదులుకు జ్ఞాపిక,ధ్రువపత్రాన్ని అందజేశారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెల్దండ శ్రీధర్, అధ్యాపక బృందం అభినందించారు.

## మనోప్రగతి క్యాంపు



**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ మండల మహిళా సమాఖ్య, వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆసంఘం కార్యాలయంలో నైబర్ హుడ్ సెంటర్మనోప్రగతి క్యాంపు నిర్వహించారు.0 నుంచి18 ఏళ్ల లోపు వికలాంగుల పిల్లల శారీరక,మానసిక అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఈ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీఏ వికలాంగుల విభాగం డీపీఎం రామలింగయ్య హాజరై మాట్లాడారు.ఈకేంద్రం ద్వారాపిల్లలకుఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్ వంటి సేవలను నిపుణుల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు సరిత,సుగుణమ్మ,జిల్లా కోఆర్డినేటర్ వెంకన్న, సీబీఆర్ వర్కర్ కె. రవి, ప్రొఫెషనల్స్ సంధ్యారాణి,మంజుల,యాక్టివిస్ట్ శైలజ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని గుడిమల్కాపురం సబ్స్టేషన్ నుండి 11కెవి చింతలపాలెం టౌన్ ఫీడర్ మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు చింతలపాలెం టౌన్కు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సైదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మిగతా అన్ని ఫీడర్స్కి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 20లోగా పత్తిని అమ్ముకోవాలి

ప్రజాపక్షం/చింతలపాలెం ః మండలంలోని భారతమ్మ కాటన్మిల్, అభిజ్ఞ ఆగ్రో ఇండస్ట్రీలలో ప్రస్తుతం రైతుల నుండి ప్రభుత్వం మద్ధతు ధరకు పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) వారు కొనుగోలు చేస్తున్నారని హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి తెలిపింది. ఈ సంవత్సరం 202526 సంవత్సరంలో తేది.20.02.2026 వరకు మాత్రమే పత్తిని సిసిఐ వారు కొనుగోలు చేయుదరని, దాని తర్వాత పత్తి కొనుగోలు చేయబడదని సిసిఐ నిర్ణయించినట్లు తెలిపారు. రైతులందరూ తమ పత్తిని 20 వరకు మాత్ర మే సదరు జిన్నింగ్ మిల్లులలో అమ్ముకోవాలని కోరారు.

## తెలంగాణలోకి అడుగుపెట్టిన దమ్మ పాదయాత్ర



**ప్రజాపక్షం/నందికొండ:** కర్ణాటక రాష్ట్రంలోని కలబురగిలో ఫిబ్రవరి 1న ప్రారంభమైన దమ్మ పాదయాత్ర సోమవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించింది. మడిగి ప్రాంతంలో అడుగుపెట్టిన ఈ యాత్ర మంగళవారం బుచ్చినెల్లికి చేరుకుని భక్తుల మధ్య ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.తెలంగాణలోకి దమ్మ పాదయాత్ర ప్రవేశించిన సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర బృందానికి బుద్ధవనం కండువాలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భిక్షువులకు ఆత్మీయ ఆహ్వానం తెలిపారు.బౌద్ధ భిక్షువుల బోధనలు,బుద్ధ దాతువుల దర్శనం అనంతరం యాత్ర మరింత వైభవంగా కొనసాగింది.ఈ యాత్రలో సంఘా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రా. సొంగషాక్ కోవిడో,థాయిలాండ్కు చెందిన బౌద్ధ భిక్షువులు, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలీవుడ్ నటులు గగన్ మాలిక్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, కే.కే. రాజా, మూర్తి, సిద్ధోజి, బుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్ రావు,కిశోర్ తదితరులు పాల్గొన్నారు.ఇక యాత్రా కార్యక్రమాల భాగంగా ఈనెల 18న హుస్సేన్ సాగర్ బుద్ధ విగ్రహాన్ని దర్శించుకుని, అనంతరం మహాబోధి బుద్ధ విహారానికి చేరుకుంటారు. 19వ తేదీన అక్కడ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మార్చి 1న నాగార్జునసాగర్ చేరుకుని,2న నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శిస్తారు.మార్చి 3న బుద్ధవనంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో యాత్ర ముగుస్తుందని మల్లేపల్లి లక్ష్మయ్య వెల్లడించారు.ఈదమ్మ పాదయాత్ర బౌద్ధ ధర్మం సందేశాలను ప్రజల్లో విస్తరింపజేస్తూ, శాంతి, సామరస్యాలకు ప్రతీకగా కొనసాగుతోంది.

## పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుల కౌన్సిలర్ చైర్మన్ల కోసం జరుగుతున్న ఎన్నికల సరళినీ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. 13 వార్డులకు ఏర్పాటుచేసిన 26 పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు పోలింగ్ శాతం ఏర్పాట్లు అధికారులు పోలీసు యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. పోచంపల్లి పట్టణంలోని వివిధ వార్డుల్లో తిరిగి ఓటర్లు ఓటింగ్లో పాల్గొనే విధంగా ఆయన తగు సూచనలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి తడక వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు భారత లవకుమార్, మండల అధ్యక్షులు కాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు ముఖ్య నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## రవికుమార్కు మహాత్మా గాంధీ జాతీయ సేవా పురస్కారం



**ప్రజాపక్షం/నకిరేకల్:** మండలంలోని నోముల గ్రామానికి చెందిన పల్సర్ రవికుమార్కు మహాత్మా గాంధీ జాతీయ సేవా పురస్కారం లభించింది. టీపీసీసీ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్గా వ్యవహరిస్తున్న ఆయన,వికలాంగులు,వృద్ధులు,పేదల సంక్షేమం కోసం చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకున్నారు.మంగళవారం హైదరాబాద్లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టీఆర్వీఎస్),అయాన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోఈపురస్కారాన్ని సినీ నటుడు పసునూరి శ్రీనివాస్, గాయకుడు నల్లగొండ గద్దర్ నర్సన్న,కాంగ్రెస్ నాయకురాలు వీరబోయిన రజిత ప్రదానం చేశారు.టీఆర్వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ మున్నా, షేక్ నయీమ్, ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించినట్లు ఆయన తెలిపారు.ఈఅవార్డు తనకు అందడం ఎంతో సంతోషకరమని ఆయన అన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పురపోరు

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా



**ప్రజాపక్షం/హుజూర్నగర్:** హుజూర్నగర్ పురపోరు ప్రశాంతంగా ముగిసింది. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేట జిల్లాలో హుజూర్నగర్ 28 వార్డులోని ప్రజలు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలోని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 82.88 శాతం నమోదు కాగా అందులో పురుషులు 11,287 మంది, మహిళలు 12,633, ఇతరులు 6గురుతో కలిసి 23,926 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లను చేశారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పి కె.నర్సింహా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు పటిష్టం చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట హుజూర్నగర్ సిఐ చరమందరాజు, ఎస్ఐ బండి మోహన్, ఎఎస్ఐ బలరాంరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం

**ప్రజాపక్షం/వలిగొండ ః** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నియోజకవర్గ పరిధిలో చేస్తున్న అభివృద్ధి ఫలాలతో మున్సిపల్ చైర్మన్లను కైవసం చేసుకోగలుగుతామని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి దీమా వ్యక్తం చేశారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి ఫలాలతో మున్సిపాలిటీలను కైవసం చేసుకోగలుగుతామని ఆయన అన్నారు.

## బ్రహ్మోత్సవాలకు వీధి దీపాల ఏర్పాటు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుండి ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నిధులతో 58 వీధి దీపాలను మంజూరు చేయించానని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశారు. వీధిలైట్లు మరి కూడా లోని ప్రధాన రహదారి ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు,మాస శేఖర్, ఎం సతీష్,వీరమల్ల లోకేష్,పొనుగోటి శేఖర్,జమీర్,జర్పుల హనుమంతు,కల్పన,రవి,రమేష్,అంజమ్మ,శ్రీను నాయక్ పాల్గొన్నారు.

## ఆమ్ఆద్మీ ఒంటరి.... పోరాటం



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ రెండవ వార్డు నుంచి పోటీ చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఏకైక అభ్యర్థి కేలం శ్రీనివాస్ తన ప్రత్యేక శైలిలో స్థానికుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.హడావిడి లేకుండా సాధారణ కుర్చీలో కూర్చొని ఓటర్లను కలుస్తూ నేను సామాన్యుడిని ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తుండటం అందరినీ ఆకట్టుకుంది. పోలింగ్ స్టేషన్ సమీపంలో ఓటర్లతో మాట్లాడుతున్న ఆయన,పార్టీ పెద్దది కాదు ప్రజల మద్దతే పెద్దది" అన్న సందేశాన్ని అందిస్తున్నారు.ఒంటరిగానే పోరాటం చేస్తున్నప్పటికీ తన నమ్మకం,సరళత,ప్రజలకు చేరువయ్యే తీరుతో స్థానికుల్లో విశ్వాసం కలిగిస్తున్నారు.ఇతర పార్టీల లాగా హంగామా లేకుండా భిన్నంగా, సాధారణ వ్యక్తిలా రోడ్డు పక్కన కూర్చొని మాట్లాడటం ఆయన ప్రత్యేకతగా మారింది.ఈనిరాడంబర అభ్యర్థన రెండవ వార్డులో చర్చనీయాంశంగా మారి, ఓటర్లలో మంచి స్పందన తెచ్చుకుంది. నేను సామాన్యుడిని"ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం మీ ఓటు నాకే వేయండి అంటూ శ్రీనివాస్ ఓటర్లను కోరుతున్నారు.

## కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/నాంపల్లి:** పెద్దాపురం ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండో సంవత్సరం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలర్ బూరుగు రమేష్ విద్యార్థులకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం ఎంచుకోవాల్సిన ఉన్నత విద్యా కోర్సులపై అవగాహన కల్పించారు.ఐఐఐటీ,ఇంజనీరింగ్,నర్సింగ్, మెడికల్ ఎడ్యుకేషన్ వంటి కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పోచంపల్లిలో ఎకో ఫ్రెండ్లీ మోడల్ పోలింగ్ కేంద్రం సూపర్

## సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్ రెడ్డిలను అభినందించిన కలెక్టర్ హనుమంతరావు





**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026 భాగంగా బుధవారం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల కోసం 8వ వార్డులో ఏర్పాటుచేసిన ఎకో ఫ్రెండ్లీ మోడల్ పోలింగ్ కేంద్రం సూపర్ అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అభినందించారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి పోచంపల్లి మున్సిపాలిటీ సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డిలు అన్ని విభాగాలు కలిసి సమన్వయంతో సంయుక్తంగా చేస్తున్న ఎన్నికల నిర్వహించిన తీరును చూసి ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం అవగాహన రావాలని వచ్చే మున్సిపాలిటీ పాలకవర్గాలకు గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలు అవగాహన సెంటర్‌లుగా ఉంది. గ్రామాలు పచ్చదనం పరిశుభ్రతతో పరిఢవిల్లాలనే ఉద్దేశంతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు. అన్ని గ్రామాలలో రాబోయే జరగబోయే అన్ని ఎన్నికలలో ఇదేవిధంగా ఎకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. పోచంపల్లి మొత్తం ఎన్నికల సిబ్బంది బాగా పనిచేస్తున్నారని మెచ్చుకున్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ మోడల్ పోలింగ్ కేంద్రాలలో అదేవిధంగా ఉత్తమ ఎన్నికల నిర్వహణకు గాను రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్నట్లు గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో మున్సిపాలిటీ ఎన్నికలలో అత్యధిక ఓటింగ్ శాతం నమోదుకు ఎకో ఫ్రెండ్లీ గ్రీన్ ఎన్విరాన్మెంట్ మోడల్ పోలింగ్ స్టేషన్ ఒక అవగాహన కేంద్రంగా చైతన్య పరిచేందుకు ఓటర్లను ఓటు వేసే విధంగా సహకరించేందుకు ఉపయోగపడతాయని అధికారులు ఆ వైపుగా చేస్తున్న చర్యలు అభినందనీయమని కొనియాడారు. అర్బన్ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు. గ్రామాలలో ఓటర్లు చైతన్యమయ్యి ఎక్కువమంది ఓటింగ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లను ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వివిద విభాగాల అధికారులు పోలింగ్ సిబ్బంది పోలీస్ ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు.

# మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కౌంటింగ్ హాలులోకి అనుమతించబడవు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ హాళ్లలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా నిషేధించబడినట్లు స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఎవరూ ఈ నిబంధనలను ఉల్లంఘించరాదని ఆదేశించారు. భద్రతా తనిఖీలు నిర్వహించిన తర్వాత మాత్రమే లోనికి అనుమతిస్తామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





# ఓటు హక్కు వినియోగించుకున్న అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/యాదాద్రి ః** మున్సిపల్ ఎన్నికల పోలింగ్లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, కుటుంబ సభ్యులతో కలసి 3వ వార్డు రాయగిరిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో 6వ వార్డు నుండి సిపిఐ బలపర్చిన కాంగ్రేస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోడి శ్రీనివాసులు దంపతులు వారి కుమార్తెలు బుధవారం తమ ఓటు హక్కను వినియోగించుకున్నారు.

# ఆలేరులో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్






**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరులో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఆలేరులోని 12 వార్డులకు గాను ఎన్నికలు జరిగాయి. ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఇచ్చారు అధికారులు. ఆలేరులో 85.81 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఆలేరులో మొత్తం ఓటర్లు 13632 గాను, 11697 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 12 వార్డులలో 39 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. 13న లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలబోతుంది.

ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద సందడి చేసిన కలెక్టర్

ఆలేరు మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రంను జిల్లా కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఏర్పాటుచేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రాల్లో పచ్చని మొక్కలు, పూల అలంకరణ, కొబ్బరి తోరణాలు, ప్లాస్టిక్ రహిత సామాగ్రి, పర్యావరణహిత అలంకరణతో ఓటర్లకు మైమరిపించే అనుభూతిని కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. శాంతియుతంగా, పారదర్శకంగా , ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ జగన్ పాల్గొన్నారు.

# హాలియా మున్సిపల్ చైర్మన్‌కు... అందరి చూపు ఆ రెండింటి వైపే

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీలో జరుగుతున్న పుర ఎన్నికల్లో అందరి చూపు ఆ రెండు వార్డులపైనే ఉంది. హాలియాలో ఉన్న 12 వార్డుల్లో పదవ వార్డు ఏకగ్రీవం కాగా 11 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో మూడవ వార్డు,ఏడో వార్డుపైనే అందరి చూపు నిక్షిప్తమై ఉంది. ఈ రెండు వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్నారనే భావన నెలకొనడమే ఇందుకు కారణం. హాలియా మున్సిపాలిటీలో ఏడవ వార్డు నుంచి చింతల చంద్రారెడ్డి, మూడవ వార్డు నుంచి కుందూరు వెంకటరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వీరికి ప్రత్యర్థులుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏడవ వార్డు అభ్యర్థిగా చిట్టిపోలు శ్రీనివాస్,మూడవ వార్డు అభ్యర్థిగా వర్ర వెంకటరెడ్డి లు ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా కుందూరు వెంకటరెడ్డి,వర్ర వెంకటరెడ్డిలు ప్రత్యర్థులుగా పోటీ పడగా ప్రస్తుతం వారే తిరిగి మళ్లీ ప్రత్యర్థులు కావడం గమనార్హం. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో హాలియా ప్రజల దృష్టి అంత ఈ రెండు వార్డులపైనే నెలకొని ఉంది. ఈ రెండు వార్డుల్లో నూ పోటీ తీవ్రంగా ఉండడం కూడా మరింత ఉత్కంఠ నెలకొంది. హాలియా మున్సిపాలిటీ అయిన తర్వాత ఎన్నికలు జరగటం ఇది రెండవ సారి.మొదటిసారి హాలియా మున్సిపల్ చైర్మన్ జనరల్ మహిళ కావడంతో అప్పుడు బీఆర్ఎస్ చైర్ పర్సన్ గా వైశ్య సామాజిక వర్గానికి చెందిన వెంపటి పార్వతమ్మ అయ్యింది. ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో మున్సిపల్ చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి ఎడవల్లి అనుపమ నరేందర్ రెడ్డిని చైర్ పర్సన్‌గా చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో హాల్య మున్సిపాలిటీలో భాగమైన ఇబ్రహీంపేటను తిరిగి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం హాలియా మున్సిపాలిటీ జనరల్ కి రిజర్వ్ అయింది. ఈక్రమంలో ఇరు పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ కూడా మంచి పోటీ ఇస్తుండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి.అయితే మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్న అభ్యర్థులు పోటీ చేస్తున్న వార్డులపైనే నియోజకవర్గ నాయకుల,ప్రజల చూపు మళ్ళింది.ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ ఈసారి మున్సిపల్ చైర్మన్ జనరల్ కు రిజర్వ్ కావడంతో హాలియా కొత్త మున్సిపాలిటీకి చైర్మన్ ఎవరా అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొని ఉంది.

# రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేకనే దాడులు

## నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

## మాజీ ఎమ్మెల్యే నల్లమోతు, జూలకంటి, తిప్పన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాజకీయంగా ఎదుర్కొనేందుకు శక్తి లేకనే దాడులకు పాల్పడుతున్నారని మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డిలు అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 29వ వార్డుకు చెందిన మిత్రపక్షాల ఏజెంట్లపై కాంగ్రెస్ అభ్యర్థి జావిద్, అతని అనుచరులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికల్లో ఘర్షణకు దిగడం మంచి సంస్కృతి కాదన్నారు. దాడికి గురైన బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే తిరిగి ఆసుపత్రికి వచ్చి దాడులకు పాల్పడడమేంటని ప్రశ్నించారు. అదేవిధంగా ఆసుపత్రిలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డిపై, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్థలపై కర్రలపై, రాడ్లపై దాడులకు పాల్పడడం మంచి పద్దతి కాదన్నారు. ఇంతా జరుగుతున్న పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించడం సబబుకాదన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని తాము అధికారంలోకి వస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తీవ్ర గాయాలైన ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడకుండా రాజకీయాలు హుందాగా చేయాలని లేకుంటే తాము కూడా అదే తరహాలో ప్రవర్తించాల్సి ఉంటుందన్నారు. పోలీసులు దాడులకు పాల్పడినై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థ, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, హాతీరాం, మోసిన్‌అలీ, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బాబయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.























# ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రనీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోదాడ పట్టణంలోని 14వ వార్డులో ఉన్న 34వ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సూర్యాపేట పట్టణంలోని 44వ వార్డులోని సిద్ధార్థ ఉన్నత పాఠశాల 54వ పోలింగ్ బూత్ నందు ఓటు వేశారు. సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీ 14వ వార్డు పోలింగ్ బూత్ 49వద్ద తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు సూర్యాపేట మున్సిపాలిటిలోని కృష్ణానగర్ కాలనీ 14వ వార్డులో తన సతీమణితో కలిసి ఓటు వేశారు.

**ప్రజాపక్షం/నల్లగొండ** :నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి 34వ డివిజన్ వీటి కాలనీలోని గీతాంజలి కళాశాలలో ఓటు వేశారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు 132వ బూత్ ప్రగతి జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ మేయర్ అభ్యర్థి చకిలం వసంత అనిల్ కుమార్ దంపతులు 48వ వార్డు గీత విజ్ఞాన మందిర్‌లో ఓటు వేశారు.



